హోరుగాలి.. వర్షం

- కూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
- నిలిచిన విద్యుత్ సరఫరా



ఆత్మకూరులో భీకర గాలివాన

ఆత్మకూరు: గత కొద్ది రోజులుగా తీవ్రమైన ఎండలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో గురువారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన భీకర వర్షం కురిసింది. మధ్యాహ్నం 3 గంటల నుంచే కారుమబ్బులు కమ్ముకొని ఒక్కసారిగా ఈదురు గాలులు వీచాయి. వీటికితోడు వడగండ్ల వాన కురిసింది. ఈదురుగాలులకు పట్టణంలోని పలుచోట్ల చెట్లు విరిగిపడడం, విద్యుత్ స్తంభాలు నేలకూలడంతో కరెంట్ సరఫరా నిలిచిపోయింది. మున్సిపల్ బస్టాండ్ సమీపంలోని నారాయణరావుపేటలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పెద్ద శబ్దంతో పేలిపోయింది. దీంతో సమీపంలోని వారు భయభ్రాంతులకు గురయ్యారు. జేఆర్‌పేటలోని ఓ వీధిలో కారుపై చెట్టు కొమ్మ విరిగిపడి కారు పైభాగం దెబ్బతింది. జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో పెద్ద చెట్టు కొమ్మలు విరిగిపడ్డాయి. పోలీస్‌స్టేషన్ ఆవరణలో, ఈద్గా సెంటర్‌లో పెద్ద చెట్లు విరిగిపడ్డాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రమాదం తప్పినట్లయింది. తూర్పువీధిలో మూడు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. సిబ్బంది విద్యుత్ సరఫరా పునరుద్ధరణ కోసం ఏఈ ఆధ్వర్యంలో తీవ్రంగా కృషి చేశారు.

బతుకుదెరువు కోసం వచ్చి తీవ్ర నష్టం

ఆత్మకూరు పట్టణంలో వీచిన ఈదురుగాలులకు, భారీ వర్షానికి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌లో తీవ్రనష్టం సంభవించింది. అక్కడ ఏర్పాటు చేసిన రేకుల షెడ్లు, బారికేడ్లు, గుడారాలు కొన్ని నేలకొరగగా, రేకులు గాలికి ఎగిరిపోయాయి. గాలికి చెల్లాచెదురైన ఎగ్జిబిషన్‌కు సంబంధించిన సామగ్రిని నిర్వాహకులు, కుటుంబసభ్యులతో కలిసి ఏరుకుంటూ బోరున విలపించారు.

చేజర్ల మండలంలో వర్షం

చేజర్ల: మధ్యాహ్నం వరకు విపరీతమైన ఎండతో అల్లాడిన ప్రజలకు వర్షంతో కాస్త ఉపశమనం లభించింది. గురువారం సాయంత్రం మండలంలోని అన్ని గ్రామాల్లో గాలులతో కూడిన వర్షం కురిసింది. ఆదూరుపల్లిలో గాలివానకు ఇంటిపై రేకులు ఎగిరిపోయాయి. ఆదూరుపల్లిలోని శివ హైర‌ర్స్ యజమాని దేవినేని శివ ఇంటిపై రేకులు ఎగిరిపోయి రోడ్డుపై పడ్డాయి. దాదాపు రూ.50 వేల నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడం, రోడ్డుపై వాహనాలు ఏమీ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.

వింజమూరులో గాలివాన

ఉదయగిరి(వింజమూరు): వింజమూరు పరిసర ప్రాంతాల్లో గురువారం సాయంత్రం ఆకాశం మేఘావృతమై విపరీతమైన గాలి వీయడంతో పలుచోట్ల చెట్లు నేలకొరిగాయి. అక్కడక్కడా రేకుల ఇళ్లు దెబ్బతిన్నాయి. వింజమూరు-చాకలికొండ మార్గంలో చిల్లచెట్లు రోడ్డుకు అడ్డంగా పడిపోయి కొంతసేపు రాకపోకలకు ఇబ్బంది కలిగింది. వింజమూరు బంగ్లా సెంటర్‌లో భారీ వృక్షాలకు సంబంధించిన కొమ్మలు రోడ్డుపై పడిపోవడంతో కొంతసేపు రవాణా వ్యవస్థ స్తంభించింది. స్థానికులు వాటిని తొలగించడంతో రాకపోకలు సజావుగా సాగాయి. గాలులతోపాటు ఓ మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రంగా ఉండి సాయంత్రం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై వర్షం కురవడంతో కొంతసేపు వేసవి తాపం నుంచి ప్రజలకు విముక్తి కలిగింది.



తీవ్రమైన ఈదురుగాలులకు చెల్లాచెదురైన ఎగ్జిబిషన్ సామగ్రి



చేజర్ల: ఆదూరుపల్లిలో ఇంటిపైన ఎగిరిపోయిన రేకులు



ఉదయగిరి: వింజమూరు బంగ్లాసెంటర్‌లో రోడ్డుకు అడ్డంగా పడిన చెట్లకొమ్మలు

క్లుప్తంగా

వాహనాల తనిఖీ



డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహిస్తున్న ఎంవీఐ రాములు

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మర్రిపాడు మండలంలోని చుంచులూరు జాతీయ రహదారి క్రాస్‌రోడ్డు వద్ద ఆత్మకూరు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాములు గురువారం వాహనాల తనిఖీ నిర్వహించారు. బద్వేలు వైపు వెళుతున్న ఓ ట్రాక్టర్‌ను ఆపి డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించగా డ్రైవర్ మద్యం తాగినట్లు గుర్తించి కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. మరో మూడు వాహనాలను సరైన పత్రాలు లేనందున కేసు నమోదు చేసి వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించామని తెలిపారు.

లేఅవుట్ పరిశీలన



లేఅవుట్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ, ఏఈ

ఉదయగిరి: మండలంలోని కొండాయపాళెంలో ఏర్పాటు చేసిన జగనన్న లేఅవుట్‌ను గురువారం ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్, హౌసింగ్ ఏఈ రామకృష్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో పక్కాగృహాలు నిర్మించుకునే లబ్ధిదారులను ఇంజినీరింగ్ సహాయకులు చైతన్యపరచి త్వరగా నిర్మించుకునేలా చూడాలన్నారు. జగనన్న కాలనీ లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, కాలనీల్లో ప్రభుత్వం అన్ని వసతులు కల్పిస్తోందని తెలిపారు.

సిబ్బందికి ఈకేవైసీ



ఈకేవైసీ చేస్తున్న సిబ్బంది

ఆత్మకూరు: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలు, వంట చేసేవారికి స్థానిక మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో గురువారం ఆధార్ కార్డు ఈకేవైసీ చేశారు. ఎంఈఓ షేక్ నజీర్ నేతృత్వంలో పట్టణం, మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలో పనులు నిర్వహిస్తున్న మహిళలు ఈకేవైసీ చేయించుకొనేందుకు పెద్ద ఎత్తున కార్యాలయానికి వచ్చారు. సిబ్బంది గౌస్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సమీక్షలు

చేజర్ల: 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంపై శుక్రవారం నుంచి సమీక్ష సమావేశాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ విజయలలిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 19న పాతపాడు, తూర్పుపల్లి, 22న పెరుమాళ్లపాడు, 24న కోటితీర్థం, వావిలేరు, 25న ఆదూరుపల్లి సచివాలయాల్లో మధ్యాహ్నం సమీక్ష సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు.

గ్రామస్తులకు వైద్యపరీక్షలు

వరికుంటపాడు: మండలంలోని గువ్వాడి గ్రామంలో గురువారం ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్యాధికారిణి కరిష్మా 42 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె బీపీ, షుగర్ పరీక్షలతోపాటు సాధారణ వ్యాధిగ్రస్తులను పరీక్షించారు. గ్రామాల్లో ప్రతి నెలా 104 వాహనం ద్వారా అందించే వైద్యసేవలను ఉపయోగించుకోవాలని తెలిపారు. ఎండలు ఎక్కువవుతున్న దృష్ట్యా ఎక్కువ మంచినీరు, మజ్జిగ తాగుతుండాలని, అత్యవసరమైతేనే బయటకు రావాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం సురేఖ, సిబ్బంది పాల్గొన్నారు.

వలంటీర్లకు ఇంటర్వ్యూలు



ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మర్రిపాడు మండలంలో ఖాళీగా ఉన్న 8 వలంటీర్ పోస్టులకు 14 మంది దరఖాస్తు చేసుకోగా ఇన్‌చార్జి ఎంపీడీఓ మస్తాన్‌ఖాన్ గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపికైన వారికి త్వరలో నియామక పత్రాలు అందజేస్తామని ఎంపీడీఓ తెలిపారు.

యువకుడిపై దాడి

ఇందుకూరుపేట: మండలంలోని ముదివర్తిపాళెంలో యువకుడిపై అదే ప్రాంతానికి చెందిన నలుగురు గురువారం దాడి చేశారు. పోలీసుల కథనం మేరకు.. ముదివర్తిపాళేనికి చెందిన సుజయ్‌కు అదే ప్రాంతానికి చెందిన సాయికృష్ణకు పెళ్లి సంబంధ విషయమై వివాదం రేగింది. దీంతో సుజయ్‌పై సాయికృష్ణ, కుమారుడు శివ, వారి బంధువులు రామయ్య, నాగార్జున కత్తి, రాడ్డుతో దాడి చేసి గాయపర్చారు. దీంతో చికిత్స నిమిత్తం బాధితుడ్ని నెల్లూరు తరలించారు. సమాచారం అందుకున్న ఎస్సై వెంకటసురేష్ ఘటన స్థలానికి చేరుకొని వివరాలను ఆరాతీశారు.

విజ్ఞానంతోపాటు వినోదం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న గ్రంథాలయాధికారి నారాయణరావు

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలు విద్యార్థులకు విజ్ఞానంతోపాటు వినోదాన్ని అందిస్తున్నాయని మర్రిపాడు గ్రంథాలయ అధికారి డి.నారాయణ రావు తెలిపారు. మర్రిపాడులోని శాఖా గ్రంథాలయంలో గురువారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు, మ్యూజికల్ డే నిర్వహించడంతోపాటు వ్యాయామం చేయించారు. కార్యక్రమంలో విద్యార్థులు ఉల్లాసంగా పాల్గొన్నారు. అనంతరం పుస్తక పఠనం, కథలు చెప్పడం, గణిత విభాగంలో తెలుగు భాషా భాగాలు తదితర అంశాల్లో వారికి శిక్షణ ఇచ్చారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

వైభవంగా కనకదుర్గాదేవి ఉత్సవాలు



గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

ఆత్మకూరురూరల్: మండలంలోని రామస్వామిపల్లిలో వెలసిన శ్రీకనకదుర్గాదేవి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మాజీ సర్పంచ్ యర్రంరెడ్డి నాగమోహన్‌రెడ్డి దంపతులు సమకూర్చిన పంచలోహ ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక వాహనంపై కొలువుదీర్చి ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ధర్మకర్త పుల్లారెడ్డి ఆధ్వర్యంలో హోమాలు నిర్వహించి అమ్మవారి ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలి



సచివాలయ ఉద్యోగులకు సూచనలిస్తున్న తహసీల్దార్ ఆనందరావు

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): సచివాలయ ఉద్యోగులు ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలని మర్రిపాడు తహసీల్దార్ ఆనందరావు సూచించారు. మండలంలోని డీసీపల్లి సచివాలయాన్ని ఆర్‌ఐ సురేంద్రతో కలిసి గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని అన్ని విభాగాల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ముఖ్యంగా సంక్షేమ పథకాల క్యాలెండర్లను తప్పనిసరిగా సచివాలయం గోడలపై ప్రదర్శించాలని, ప్రతి రోజూ మధ్యాహ్నం 3 గంటల నుంచి ప్రజావిజ్ఞప్తులు స్వీకరించి వారి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని తెలిపారు. వీఆర్వో గౌస్‌బాషా, సంక్షేమ సహాయకుడు అశోక్, సాంకేతిక సహాయకుడు నాగార్జున తదితరులను వారి విభాగాలకు సంబంధించి పలు విషయాలపై వివరాలు అడిగి తెలుసుకొని సూచనలు చేశారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి



ప్రతిజ్ఞ చేయిస్తున్న రేంజ్ అధికారి

ఉదయగిరి: ప్రతి వ్యక్తి అడవులను కాపాడుకోవడంతోపాటు పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని స్థానిక అటవీ రేంజ్ అధికారి తుమ్మల ఉమామహేశ్వరరెడ్డి సూచించారు. గురువారం పట్టణంలోని బీసీ కాలనీ సాయిబాబా ఆలయంలో భక్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మాట్లాడుతూ అడవుల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తాచెదారం వేయరాదన్నారు. అడవులకు నిప్పు పెట్టడం నేరమని, అడవుల్లోని వృక్షాలు, జంతువులను కాపాడుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

బలవర్ధక ఆహారం తప్పనిసరి



పౌష్టికాహారం అందజేస్తున్న దృశ్యం

దుత్తలూరు: క్షయ వ్యాధిగ్రస్తులు బలవర్ధకమైన ఆహారం తప్పనిసరిగా తీసుకోవాలని నర్రవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు ప్రసన్నలక్ష్మి, మనోజ్ఞ తెలిపారు. ప్రధానమంత్రి నిశ్చయ పోషణ్ కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక వైద్యశాలలో క్షయ రోగులకు 9 రకాలైన బలవర్ధక ఆహార పదార్థాలను అందించారు. అలాగే వ్యాధిని ర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో క్షయవ్యాధి సూపర్‌వైజర్ ఎస్‌కే షబ్బీర్, హెల్త్ అసిస్టెంట్ రియాజ్, పీహెచ్‌ఎన్ రవిజా, ఎస్‌కే అలీం, రమాదేవి, సౌజన్య పాల్గొన్నారు.

నేడు సామాజిక తనిఖీ సభ

చేజర్ల(సోమశిల): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ బహిరంగ సభ శుక్రవారం అనంతసాగరంలోని ఎంపీడీఓ కార్యాలయం ప్రాంగణంలో ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మధుసూదనరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 15వ విడత సామాజిక తనిఖీ మండలంలోని వివిధ గ్రామాల్లో ఈ నెలలో నిర్వహించారని, తనిఖీ నివేదికల్లోని అంశాలను సభలో తెలియజేస్తారని తెలిపారు.

నేటి నుంచి గ్రామసభలు

ఆత్మకూరురూరల్: మండలంలోని పలు గ్రామాల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంపై శుక్రవారం నుంచి గ్రామ సభలు నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వాసిలి, నాగులపాడు, మురగళ్ల గ్రామాల్లో 19వ తేదీన, వెన్నవాడ, రామస్వామిపల్లి గ్రామాల్లో 23వ తేదీన ఈ సభలు నిర్వహిస్తామని తెలిపారు. ఎంపీపీ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ సభలకు స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, సచివాలయాల ఉద్యోగులు, వలంటీర్లు హాజరుకావాలని తెలిపారు.

రేపటి నుంచి విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు

ఉదయగిరి: మండలంలోని గానుగపెంటపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీరామచంద్రస్వామి ఆలయంలో ఈ నెల 20 నుంచి 24వ తేదీ వరకు హనుమత్ సమేత సీతారామ లక్ష్మణ విగ్రహ, ధ్వజ, శిఖర కలశ బొడ్డురాయి ప్రతిష్ఠ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు గురువారం నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. 20వ తేదీన గంగానయనం, గణపతిపూజ, పుణ్యాహవచనం, 21న హోమాలు, గ్రామోత్సవం, 22న యంత్రప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ పూజలు జరుగుతాయని తెలిపారు. 23న మహిళలకు ముగ్గుల పోటీలు, స్వామివారి గ్రామోత్సవం, 24న ఉట్టి మహోత్సవం, వసంతోత్సవం, పార్వేట కార్యక్రమాలతో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు. ఉత్సవాల సందర్భంగా అన్నదానం నిర్వహిస్తున్నామని తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

కలిగిరి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని ప్రముఖ ఎన్‌ఆర్‌ఐ, శాస్త్రవేత్త మూలే వెంకటరమణారెడ్డి తెలిపారు. మండలంలోని తూర్పుదూబగుంట, చిన్నఅన్నలూరు, నరసారెడ్డిపాళెం గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు సజావుగా కొనసాగాలంటే 2024లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరలా ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు.

ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి



ఆత్మకూరు: ఆటో డ్రైవర్లకు సూచనలిస్తున్న ఎస్సై శివశంకర్‌రావు



ఆత్మకూరురూరల్: ఆటో డ్రైవర్లకు సూచనలిస్తున్న ఎస్సై విశ్వనాథ్‌రెడ్డి

ఆత్మకూరు: ఆటో డ్రైవర్లు వాహనాలు నడిపే క్రమంలో రహదారి భద్రతా నిబంధనలు పాటించాలని ఎస్సై ఎం.శివశంకర్‌రావు సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద గురువారం ఆటో డ్రైవర్లకు రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలను తమవెంట ఉంచుకోవాలని, యూనిఫాం తప్పనిసరిగా ధరించాలని తెలిపారు. పరిమితికి మించి ఆటోల్లో ప్రయాణికులను ఎక్కించుకోరాదన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే శిక్షలు, జరిమానాలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

ఆటో డ్రైవర్లకు అవగాహన

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): ఎస్సై విశ్వనాథరెడ్డి మర్రిపాడు పోలీస్‌స్టేషన్‌లో గురువారం మండలంలోని ఆటో డ్రైవర్లకు రహదారి భద్రతకు సంబంధించి పలు అంశాలపై అవగాహన కల్పించారు. అధిక వేగంతో వాహనాలు నడపరాదని, పరిమిత సంఖ్యలో ప్రయాణికులను ఎక్కించుకోవాలని, అధిక చార్జీలు వసూలుచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రవాణాశాఖ పరిధిలో అన్ని పత్రాలను సక్రమంగా నిర్వహించే బాధ్యత ఆటోడ్రైవర్లు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ సానా శ్రీనివాసులురెడ్డి, సిబ్బంది శ్రీనివాసులు పాల్గొన్నారు.



ఉదయగిరి: ఆటో డ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న సీఐ గిరిబాబు

యూనిఫాం ధరించాలి

ఉదయగిరి: ఉదయగిరి పోలీస్ సర్కిల్ పరిధిలోని ఆటోడ్రైవర్లు తప్పనిసరిగా యూనిఫాం ధరించాలని సీఐ వి.గిరిబాబు తెలిపారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు ప్రయాణికుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, ఆటోకు సంబంధించిన పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. అధిక లోడుతో ఆటోలు నడిపితే చర్యలు తప్పవని, ఆటోలకు సౌండ్‌బాక్స్‌లు ఉంటే వెంటనే తొలగించాలని తెలిపారు. అతివేగంతో ఆటోలు నడిపి ప్రమాదాలకు గురికావద్దన్నారు. కార్యక్రమంలో ఎస్సై ఎస్.ప్రభాకర్ పాల్గొన్నారు.

సమస్యలు శాంతియుతంగా పరిష్కరించుకోవాలి



ఉదయగిరి: ప్లాట్ల యజమానులతో మాట్లాడుతున్న జాషువా డేనియేల్

- ఏపీ స్టేట్ మైనార్టీ కమిషన్ వైస్ చైర్మన్ జాషువా డేనియేల్

వింజమూరు(ఉదయగిరి): వింజమూరులో పాత ఎంఎస్సార్ డిగ్రీ కళాశాలకు ఎదురుగా ఉన్న లేఅవుట్‌లో చర్చి ఏర్పాటు విషయమై ఏర్పడిన సమస్యను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని ఏపీ మైనార్టీ కమిషన్ వైస్ చైర్మన్ జాషువా డేనియేల్ తెలిపారు. 15 ఏళ్ల క్రితం వేసిన లేఅవుట్‌లో పలువురు ప్లాట్లు కొనుగోలు చేశారు. వారిలో ఒకరు తన స్థలంలో చర్చిని ఏర్పాటు చేసుకోవడంతో మిగిలిన వారు అభ్యంతరం తెలిపారు. ఈ విషయంపై గురువారం ఆయన ఆ ప్రాంతానికి చేరుకొని ఇరువర్గాలను పిలిచి మాట్లాడారు. సున్నితమైన సమస్యను శాంతియుతంగా పరిష్కరించుకోవాలన్నారు. ఇరువర్గాలు ఆ ప్రతిపాదనకు ఒప్పుకొని వెళ్లిపోయారు. కార్యక్రమంలో అడిషనల్ పీడీ నిర్మలాదేవి, ఎంపీడీఓ ప్రసన్నకుమారి, తహసీల్దార్ రవీంద్రబాబు, ఎస్సై రంగనాథ్‌గౌడ్, స్పెషల్ బ్రాంచ్ ఎస్సై ఎ.వెంకటేశ్వర్లు, నాయకుడు రఘురామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గొట్టిగుండాలలో..

కొండాపురం: మండలంలోని గొట్టిగుండాలలో చర్చి వివాదంపై ఫిర్యాదు అందడంతో ఆంధ్రప్రదేశ్ మైనార్టీ కమిషన్ వైస్ చైర్మన్ జాషువా డేనియేల్ చర్చి సమస్యను పరిష్కరించేందుకు గొట్టిగుండాలలో గురువారం పర్యటించారు. కొండాపురం అధికారులు తెలిపిన సమాచారం మేరకు చర్చి మైకులతో గ్రామంలో గోల సృష్టిస్తున్నారని కొంతమంది గ్రామస్తులు గతంలో పంచాయతీ కార్యదర్శికి లిఖితపూర్వకంగా తెలపడంతో పంచాయతీ కార్యదర్శి నోటీసులు అంటించారని, చర్చి నిర్వాహకులు ఎస్సీ కమిషన్‌ను కలిశారని తెలిపారు. సమస్యను పరిష్కరించి నోటీసును వెనక్కు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారని అధికారులు తెలిపారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

ఆత్మకూరు: ఆత్మకూరు డివిజన్ పరిధిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీల భర్తీకి గురువారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ సాధు కరుణకుమారి నేతృత్వంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఆత్మకూరు సీడీపీఓ జైనకుమారితోపాటు సీడీపీఓలు ఇంటర్వ్యూల నిర్వహణలో పాల్గొన్నారు. అంగన్‌వాడీ కార్యకర్త, సహాయకురాలు తదితర 9 ఖాళీలకు నిర్వహించిన ఈ ఇంటర్వ్యూలకు 20 మంది అభ్యర్థులు హాజరైనట్లు ఐసీడీఎస్ అధికారులు తెలిపారు. త్వరలో ఎంపికైన వారి వివరాలు తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఓ మధుసూదనరావు, అసిస్టెంట్ సీడీపీఓ సునీలత తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమావేశం



మాట్లాడుతున్న మెట్టుకూరు ధనుంజయరెడ్డి

ఉదయగిరి: ఉదయగిరి నియోజకవర్గ పరిశీలకుడు మెట్టుకూరు ధనుంజయరెడ్డి గురువారం ఉదయగిరిలోని పలువురు నాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024లో ఉదయగిరి నియోజకవర్గం నుంచి పోటీచేసే వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి టిక్కెట్ ఎవరికి ఇచ్చినా విభేదాలు వీడి అభ్యర్థి విజయం కోసం కృషి చేయాలని సూచించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు దుగ్గిరెడ్డి గురవారెడ్డి, మూలె వినయ్‌రెడ్డి, అక్కి భాస్కర్‌రెడ్డి, అల్లూరురాజు తదితరులు ఉన్నారు.

దౌర్జన్యం నుంచి కాపాడండి



తమ గోడు తెలియజేస్తున్న బాధితులు

కావలి: పట్టణంలోని టూ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వెంగళరావునగర్‌లో 18వ వార్డు టీడీపీ నాయకుడు శానం హరి మహిళలు, యువకులపై దౌర్జన్యం చేస్తున్నాడని బాధిత మహిళలు, యువకులు ఆరోపించారు. అతని ఆగడాల నుంచి తమను అధికారులు, పోలీసులు కాపాడాలని కోరారు. ఈ మేరకు కావలిలోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధితులు పాశం రాజేశ్వరి, ముద్రకొండ జైష్ణవి, పవన్‌కుమార్, కన్నెం వెంకటకుమార్ మాట్లాడారు. శానం హరి భార్యభర్తల మధ్య, కుటుంబ కలహాల్లో కలగజేసుకుని అరాచకాలకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. ప్రశ్నిస్తే రౌడీలతో దాడులు చేయిస్తున్నాడని వాపోయారు. పార్టీని అడ్డంపెట్టుకుని ఎన్నో అరాచకాలకు పాల్పడుతున్న శానం హరిపై తగిన చర్యలు తీసుకుని మాకు రక్షణ కల్పించాలని బాధితులు విజ్ఞప్తి చేశారు.